## విలేకరులు కావలెను

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



RNI:TGTEL/25/A1882

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Karimnagar,Telangana | సంపుటి:1, సంచిక:53 | volume: 1, Issue:53 | శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00



## రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్ భేటీ...

- తెలంగాణ విద్యార్థులకు యూకే స్కాలర్‌షిప్స్‌కు అంగీకారం...
- తెలంగాణ విద్యార్థులకు చెవెనింగ్ స్కాలర్‌షిప్స్‌కు బ్రిటన్ అంగీకారం...
- రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సుముఖత...
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానం...
- వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరిన ముఖ్యమంత్రి...
- ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన బ్రిటీష్ హైకమిషనర్...



యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్ విషయంలో కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సూత్రప్రాయంగా అంగీకరించారు. భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వారితో పాటు డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్‌, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్ కూడా ఉన్నారు. యూకే ప్రభుత్వం అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ లో భాగంగా అందిస్తున్న చెవెనింగ్ స్కాలర్‌షిప్ లను కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు అందించడానికి ఈ సందర్భంగా అంగీకరించారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి గారికి వివరించారు. యూకేలోని యూనివర్సిటీల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి వర్సిటీలు అడ్మిషన్లు, ఇతరత్రా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో కొత్తగా తీసుకురానున్న ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదా గురించి ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి లిండీ కామెరాన్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని, ప్రధానంగా జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీలకు సంబంధిత రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తి పట్ల బ్రిటిషన్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాల దహనంపై సుప్రీం సీరియస్



న్యూఢిల్లీ : ఏటా శీతాకాలంలో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుతోన్న విషయం తెలిసిందే. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం దీనికి ఓ కారణమనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీనికి పాల్పడుతున్న కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టు అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ పంట వ్యర్థాలను తగలబెట్టకుండా ఉండేందుకు రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు రైతులకు శిక్ష, జరిమానా విధించాలనే కోణంలో ఎందుకు ఆలోచించట్లేదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. రైతులు మనకు అన్నం పెడుతున్నారు కాబట్టి వారు ప్రత్యేకమైనవారని, అలా అని పర్యావరణాన్ని పాడు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా అని ప్రశ్నించింది. కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టు అవుతుందని తెలిపింది. దీనిపై కొంతకాలంగా సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది.

## ఇవిఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటో



న్యూఢిల్లీ: ఈసారి ఓటు వేసేముందు ఈ వీఎంలపై పోటీ చేసే అభ్యర్థుల కలర్ ఫోటోలు దర్శనం ఇస్తాయి. అభ్యర్థుల ముఖాలు స్పష్టంగా కన్పించేందుకు ఇప్పటివరకూ ఉన్న నలుపు తెలుపు ఫోటోలస్థానే కలర్ ఫోటోలు ఏర్పాటు చేస్తారు. అలాగే సీరియల్ నెంబర్ లు కూడా ఉంటాయి. ఈవీఎం బ్యాలెట్ పేపర్ల లేఅవుట్ ను మార్చడానికి ఎన్నికల సంఘం తన నియమ నిబంధనల్లో మార్పులు చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ఈ కొత్త మార్పు అమలవుతుంది. 1961 ఎన్నికల నిర్వహణ నియమాలలోని 49 బి రూల్ ప్రకారం అభ్యర్థుల ఛాయా చిత్రాలు ఇప్పుడు రంగుల్లో ముద్రిస్తారు. మునుపటి నలుపు తెలుపు లేదా ఫోటో లేని వెర్షన్ స్థానంలో మరింత స్పష్టతకోసం నిబంధన మారుస్తున్నారు. అంతే కాదు బ్యాలెట్ పేపర్ పై అభ్యర్థి సీరియల్ నెంబర్ కూడా మరింత స్పష్టంగా కన్పిస్తుంది. నిబంధనలను మార్చి, పోలింగ్ బూత్ లలో గందరగోళాన్ని తగ్గించేందుకు డిజైన్, ప్రింట్ రెండింటినీ మార్చారు. అభ్యర్థుల పేర్లు, నోటా ఓటర్లు చదువుకోడానికి సులభంగా ఒకే ఫాంట్ లో ముద్రిస్తారు. ఈవీఎం బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్ ఎం కాగితంపై ముద్రిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోసం గులాబీ రంగు కాగితాన్ని ఉపయోగిస్తారు. బీహార్ లో రానున్న అసెంబ్లీ ఎన్నికలలోనే అప్ గ్రేడ్ చేసిన ఈవీఎం బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తారు.

## పార్కులను కాపాడిన హైడ్రా

- రూ. 16 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా...
- 1600 గజాల పార్కు స్థలానికి కబ్జాల నుంచి విముక్తి...




పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా బుధవారం కాపాడింది. దాదాపు 1600 గజాల వరకూ ఉన్న ఈ భూమి విలువ రూ. 16 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, మూసాపేట సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్ కోపరేటివ్ సొసైటీకి చెందిన లే ఔట్లో వెయ్యి గజాల పార్కు స్థలాన్ని కాపాడింది. 1967లో 172 ప్లాట్లతో ఈ లే ఔట్‌ను వేశారు. ఇందులో 1200 గజాల స్థలాన్ని పార్కులకోసం కేటాయించారు. ఈ పార్కు ఆక్రమణలకు గురౌతున్నట్టు మోతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్లు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జీహెచ్ ఎంసీ, డీటీసీపీ, రెవెన్యూ అదికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. పార్కు స్థలంగా గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని మదీనగూడ విలేజ్‌లో పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దుశించిన 600ల గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కుతో పాటు ప్రజావసరాలకు దాదాపు 600ల గజాల స్థలాన్ని కేటాయించగా.. అందులో గోశాల పేరుతో కొంత భాగం, పిండి గిర్నీ కోసం మరి కాస్త కబ్జా చేశారు. గోశాలలో ఉన్న ఆవులను ఇస్కాన్ టెంపుల్ వారికి అప్పగించి అక్కడి ఆక్రమణలను హైడ్రా తొలగించింది.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్ఐ, సర్వేయర్



కొత్తకోట : వనపర్తి జిల్లా కొత్తకోట తహసీల్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. గురువారం కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీ వాసు, మండల సర్వేయర్ నవీన్ రెడ్డి బాధితుడి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బంధువుల భూమికి సంబంధించి విచారణ నిర్వహించి ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ జారీ చేయాలని తహసీల్ కార్యాలయంలో సంప్రదించగా అందుకు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం మధ్యాహ్నం మాటు వేసి ఆర్ఐ, సర్వేయర్‌ను పట్టుని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, లేదా వాట్సప్‌లో సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

## గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధి



- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి...

పాలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపనలు చేశారు. తిరుమలాయపాలెం మండలం కుక్కలతండా గ్రామంలో రూ.3.5 కోట్లతో బీటీ రోడ్ నిర్మాణానికి, రూ. 25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లకు, మేడిదపల్లి గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి, రూ.20 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, తిమ్మక్కపేట గ్రామంలో రూ.3.68 కోట్లతో బీటీ రోడ్, రూ.10 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగింది. కూసుమంచి మండలం కేంద్రంలో రూ.35 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, చేగొమ్మ నుంచి తురకగూడెం వరకు రూ. 2.75 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.50 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, కేశవాపురంలో రూ.20.5 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది. అనంతరం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో యూటీఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోశాధికారి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.డి.జియావుద్దీన్ సంస్మరణ సభలో పాల్గొన్నాను.

## ఈక్వెడార్ డీజిల్ సబ్సిడీ రద్దు

డీజిల్ సబ్సిడీని రద్దు చేస్తున్నట్టు ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోవాస్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వందలాది మంది యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. ఈక్వెడార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జీవన వ్యయం విపరీతంగా పెరుగుతుందని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి పదవి నుంచి డేనియల్‌ను తప్పించాలని వారు పిలుపునిచ్చారు. కాగా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఈక్వెడార్ నుంచి ఈ ఆందోళన ప్రారంభమై.. ఈక్వెడార్ రాజధాని క్విటో నగర వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా 'నోబోవా అవుట్' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అధ్యక్ష భవనం కరోన్‌డెలెట్ ప్యాలెస్‌ను చుట్టుముట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. మార్గ మధ్యలోనే పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు.

## అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు



- మంత్రి సీతక్క ...

తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు. రైతుల సమస్యల విషయంలో కేంద్రం బాధ్యతను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని ఆమె హితవు పలికారు. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలో పర్యటించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. యూరియా సరఫరా అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ వాస్తవాలను వక్రీకరించి, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆమె ఆరోపించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి విమర్శించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు త్వరలోనే మరమ్మతులు చేపడతామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీతక్క వివరించారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.

## సి ఎస్ ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్ కానుకగా సైకిళ్లు పంపిణీ



**గంభీరావుపేట..సెప్టెంబర్ 18 మన వార్త ప్రతినిధి**
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ బడిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా 20,000 సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు.అందులో భాగంగా నేడు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 18 మంది విద్యార్థినీ విద్యార్థులకు హెచ్ఎం వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి సైకిళు పంపిణీ చేసిన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ అనంతరం వారు మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ అన్న కి విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణతను సాధించి రిటర్న్ గిఫ్ట్ గా ఇయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు బిజెపి నాయకులు గంట అశోక్ రాజేందర్ రెడ్డి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వజిత్ హుస్సేన్ ప్రధాన కార్యదర్శులు మలేష్ యాదవ్ విగ్నేష్ గౌడ్ ఉపాధ్యక్షులు నర్సింలు మోహన్ డాక్టర్ సత్యనారాయణ సర్వోత్తమ్ చంద్రం యాదవ్ పూల్య నాయక్ మహేష్ యాదవ్ దేవరాజు దేవేందర్ నాయక్ భాస్కర్ సత్యం దేవా గౌడ్ నవీన్ రాజేష్ పాల్గొన్నారు.

## వేములవాడ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్

## ఆది శ్రీనివాస్ జన్మదిన సంబరాలు



**గంభీరావుపేట్ సెప్టెంబర్ 18 మన వార్త ప్రతినిధి..**
గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలొ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హమీద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ సభ్యులు ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపి టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు,హమీద్ మాట్లాడుతు ఇ ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నిత్యం పనిచేస్తు, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానము భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేశారు మంచి ఆలోచనతో నిత్యం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంతో ఉన్నతంగా తీర్చి దిద్దాలని పరితపించే మహా నేత మన శ్రీనన్న అంటు కొనియాడారు,మరియు ఈ ప్రాంత ఈ రాష్ట్ర ప్రజల అబిష్టానుశారంగా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్ట సుఖాలను పాలుపంచుకుని ప్రజలను ఆదుకునేందుకు తనదైన శైలిలో ఎన్నో సేవలు అందించిన మంచి మనసున్న మాహా రాజు మన శ్రీనన్న వారికి శ్రీ రాజరాజేశ్వర స్వామి కృపతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో ఎప్పుడు సంతోషంతో ఆయురారోగ్యాలతో మునుముందు రాజకీయపరంగా ఇంకా ఎన్నో పదవులు అధిరోహించాలని మండల ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల తరపున మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము మరోసారి ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు , పెద్దలు పార్టీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్బీఐ కాలనీ వాసుల వినతి పత్రం



**-ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన నివాసులు..**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 18 మన వార్త:** అల్వాల్ ఆర్బీఐ కాలనీ వాసులు తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలంటూ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. కాలనీలో అంతర్గత రహదారులపై సీసీ రోడ్లు వేయాలని, ప్రజా స్థలంలో ఏర్పాటు చేసిన చెత్త నిల్వ కేంద్రాన్ని తొలగించాలని వాసులు ఎమ్మెల్యే గారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. వాసులు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో అనిల్ కిషోర్ గౌడ్, విజయ్‌శేఖర్ కాలనీ వాసులు శేషాద్రి, తిరుపతయ్య, శర్మ, ధీరజ్, రాజిత తదితరులు పాల్గొన్నారు.

## వ్యవ "సాయం" రైతుకు అరుదైన గౌరవం



**బూర్గంపాడు/ మనవార్త :**
వ్యవసాయం అనే పదంలోనే ఉంది 'సాయం 'ఎన్నో ఏళ్లుగా తరతరాల నుంచి రైతు ఎండనక, వాననక, పాము అనక,తేలు అనక, పగలు, రాత్రి తేడా లేక కష్టనష్టాలను ఎదుర్కొనే వాడే రైతు. ఆరుగాలం రైతు కష్టపడితేనే మన ఐదు వేళ్ళు నోట్లోకి వెళ్తాయి అన్న మాట నూటికి నూరు శాతం నిజమే. రైతు ఎన్నో వడుదుడుకులను ఎదుర్కొని పంట పండిస్తే తీరా పంట చేతికందిన తర్వాత ఏదైనా తుఫాన్ లాంటి విపత్తు ఎదురైతే ఆ రైతు గోస అంతా ఇంతా కాదు. ఇదే అదునుగా భావించి దళారులు రైతులను అడ్డగోలు రేట్లకు పంటని అడుగుతూ రైతు శ్రమను దోపిడీ చేస్తుంటారు. ఇటువంటి ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని నేడు ఒక ఆదర్శ రైతుగా గుర్తింపు పొంది అనేక సేవా కార్యక్రమాలను పాలుపంచుకుంటూ తనకంటూ ఒక గుర్తింపును సాధించుకున్న ఏకైక వ్యక్తి భూతల్లి ముద్దుబిడ్డ ఆయనే మీ గాదే నర్సిరెడ్డి. ఎంతోమంది వ్యవసాయాన్ని దండగ అన్నప్పటికీ రైతు పండించకపోతే దేశంలో ఆకలి కేకలు తప్పవు అంటున్నారు.కొత్త తరహాలో ఐదు ఎకరాల పామాయిల్ సాగు చేస్తూ, ఆర్గానిక్ పద్ధతిలో వరి సాగు చేస్తూ, ఐదు ఎకరాల్లో మామిడితో పాటు కొర్రమీనుల సాగు చేయడం విశేషం. పల్లెలు ప్రగతికి మెట్లు అన్నట్టు పల్లెల నుండే పట్టణాలకు పంటలు తరలి వెళుతున్నట్లు వ్యాఖ్యానించారు. తన వ్యవసాయాన్ని గుర్తించి జర్నలిస్ట్ మిత్రులు మరియు ఉపాధ్యాయ బృందంతో పాటు మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రతిభ పురస్కార అవార్డు అందించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## శాస్త్రీయ విద్యా విధానంకై ఉద్యమిద్దాం విద్య కాషాయకరణను తరిమికొడదాం




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 18 మన వార్త:**అల్వాల్ లోని శ్రీ అభ్యాస జూనియర్ కళాశాల కేంద్రంగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ మల్కాజ్గిరి జిల్లా ప్రథమ మహాసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 400 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభను ఏర్పాటు చేశారు.సభకు జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ అధ్యక్షత వహించగా, జాతీయ సలహాదారు మాడిశెట్టి అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.అంబానీ, ఆదానీలకు అడవుల్లోని సంపదను దోచిపెట్టేందుకు గిరిజనులను మావోయిస్టుల పేరుతో హింసించే మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘిస్తోంది. దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ దాడులు జరుపుతుంటే, తిరిగి ప్రతిస్పందించలేక అమెరికా కాళ్లకు తలోగ్గి గొప్పలు చెప్పుకోవడం కేంద్ర పాలనకు సిగ్గుచేటు" అని తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా ఏఐసిటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నర్లా చంద్రశేఖర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయకుండా యాజమాన్యాలు విద్యార్థుల నుండి నేరుగా ఫీజులు వసూలు చేసుకునే దారుణ పరిస్థితి తలెత్తుతోంది. జేబులో డబ్బులు ఉంటేనే విద్య సాధ్యమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారింది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ.గురుకుల విద్యార్థులు రోజూ అవస్థలు పడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. పెండింగ్‌లో ఉన్న 8156 కోట్లలో 600 కోట్లు మాత్రమే విడుదల చేస్తామని చెప్పడం విద్యా రంగంపై నిర్లక్ష్యం. శాస్త్రీయ విధానంతో విద్యా రంగంలో మార్పులు చేయకపోతే ప్రభుత్వాలను ప్రజలే తరిమికొడతారు అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బ్యాగారి వెంకటేష్, నాయకులు ఖుషి, నవదీప్, భాను, ధర్మభాయ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ విద్య విధానంకై ఉద్యమిద్దాం విద్య కాషాయకరణను తరిమికొడదాం అనే నినాదాలతో సభ ప్రాంగణాన్ని మార్మోగించారు.

## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం భూ సేకరణపై సంప్రదింపులు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 18 మన వార్త** : అల్వాల్ పరిధిలోని పారడైజ్ నుండి షామీర్‌పేట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులలో భాగంగా ప్రభావితమవుతున్న ప్రజల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా భూ సేకరణ ప్రత్యేక శ్రేణి అధికారి డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో, జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశం రాబోయే శుక్రవారం (19-09-2025) ఉదయం 12 గంటలకు మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయంలో జరగనుంది.ఈ సమావేశంలో భూ సేకరణ, నష్టపరిహారం తదితర అంశాలపై అధికారులతో చర్చలు జరగనున్నాయి. కాబట్టి ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రభావితమవుతున్న ప్రజలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పెద్దవెడు గ్రామానికి బసు రాక ప్రజలు,విద్యార్థులు అవస్థలు



**షాబాద్ సెప్టెంబర్ 18 ( మన వార్త ప్రతినిధి)**
హైతాబాద్ నుండి పెద్దవేడు వయా షాబాద్ వెళ్లే రోడ్ ఇంటర్నెట్ కోసం అని రోడ్డు ఇరువైపులా తవ్వకాలు జరపడంవలన పని అయిపోగానే ఈ తవ్వకాలని సరిగా పూడ్చకుండా వదిలేయడం వలన పెద్ద పెద్ద గుంతల వల్ల ఇప్పుడు ఈ రహదారి మీద ఒక్క బస్సు కూడా రావడం లేదు.రాక పోకలు చాలా ప్రమాదంగా మారాయి,బస్సు వస్తే వేరే ఏ వాహనాలు వచ్చినా పోవడానికి రోడ్ ఇరు వైపులా దిగపడతున్నవి వర్షం పడితే చాలు వాహనాలు వెళ్లడం కూడా చాలా కష్టంగా మారింది.కావున అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమత్తులు చేసి రాక పోకలకి మరియు మా ఊరికి బస్సు సౌకర్యం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## విలేకరులు సామాజిక ఉద్యమ కారులు



**-ఇజ్రాయెల్ బాబి..**

**జహీరాబాద్, సెప్టెంబర్ 18 (మన వార్త):** విలేకరులు సామాజిక ఉద్యమ కారులు అని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఇజ్రాయెల్ బాబి అన్నారు. హైదరాబాద్ నగరంలో ఈ నెల 19 న జరిగే దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర మహా సభ గోడ పత్రికను ఇజ్రాయెల్ బాబి గురువారం విలేకరులతో కలిసి జహీరాబాద్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి విలేకరులు చేస్తున్న సేవలు అమోఘమని, వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్ బాబి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంశీరాజ్, డీజేఎఫ్ కో కన్వీనర్ కె నవీన్ కుమార్, సభ్యులు చందుకుమార్, శ్రీనివాస్, రాజేందర్, రవికుమార్, మహేష్ కుమార్, అశోక్ కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం భక్తులకు పెట్టడం మహాత్భాగ్యం


**-అలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు...**

**-చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు...**



**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 18 / మన వార్త జిల్లా ప్రతినిధి** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన తెలంగాణ యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మానేపల్లి హిల్స్ భువనగిరి నందు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో ప్రతిష్టాపన చేయబడిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తుల తాకిడి రోజురోజుకి పెరగడంతో స్వామివారి నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమం వేల సంఖ్యలో వచ్చిన భక్తులు స్వీకరించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు మాట్లాడుతూ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం దేవస్థానంకు కూత వేటు దూరంలో వెలసిన స్వర్ణగిరీశునికి దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఈ సందర్భంగా స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో నిత్యం రెండు నుంచి ఐదు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయడం జరుగుతుందని అన్నం పరబ్రహ్మ స్వరూపం అది భక్తులకు అందించడం మహాభాగ్యమని , ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అడుగడుగునా మంచినీటి సౌకర్యాలు , విశాలమైన పార్కింగ్ స్థలంతో సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణం చేయబడిందన్నారు. అన్న ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు మాట్లాడుతూ ఈ స్వర్ణగిరి ఆలయం భవిష్యత్తులో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచనుందని నిత్యం వేల మందికి అన్న ప్రసాద వితరణ చేయడం చాలా గొప్ప విషయమని , స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న తిరుపతి శ్రీనివాసుని దర్శించుకున్న అనుభూతిని పొందామని , ఆలయంలో ముఖ్యంగా జల నారాయణుడు వచ్చిన భక్తులను ఆకట్టుకుంటున్నట్లు భక్తులు ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## ఎర్రగుంటపల్లిలో ఎంపీ నిధులతో మినీ వాటర్ ప్లాంట్ నిర్మాణం




**-ఎంపీ బండి సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు...**

**మన వార్త రిపోర్టర్, కోహెడ సెప్టెంబర్ 18**
సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో కేంద్రమంత్రి బండి సంజయ్ తమ ఎంపీ నిధులనుండి ఎర్రగుంటపల్లి గ్రామానికి మూడు లక్షల రూపాయల నిధులతో మినీ వాటర్ ప్లాంట్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు పురస్కరించుకుని మాజీ సర్పంచ్లు నాగు మల్లయ్య, చిట్టి సుధాకర్ల చేతుల మీదుగా బిజెపి మండల నాయకుడు నాగు అజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ నిధుల నుండి 3 లక్షల నిధులతో మా యొక్క గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ పెట్టించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు నాకు శ్రీనివాస్, నాగు నరేష్, ఆంజనేయులు, సోమ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ జీవితం చేవెళ్ల ప్రజలకు అంకితం

**- మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి వెల్లడి.**

**- ఘనంగా ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు.**

**చేవెళ్ల, సెప్టెంబర్ 18: మన వార్త ప్రతినిధి** రాజకీయ జీవితాన్ని ఇచ్చిన చేవెళ్ల ప్రజల రుణం ఎప్పటికి తీర్చుకోలేనిది. పదవి ఉన్నా లేకున్నా ప్రజా సేవలోనే ఉంటా. ఈ జీవితం చేవెళ్ల ప్రజలకు



అంకితమని చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన జన్మదినంను పురస్కరించుకుని డీసీసీ ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రేస్ పార్టీ శ్రేణులు నగరంలోని స్వగృహంకు వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకేలిచ్చి, కేక్ కట్ చేయించి, శాలువాతో రంజిత్ రెడ్డిని సన్మానించారు. స్వీట్లు తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధి తన కుటుంభంలాంటిదని అన్నారు. ప్రజలకు ఎప్పుడూ ఏ ఆపద, అవసరం వచ్చినా తాను ముందుటానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

## డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఐక్యూఏసి ప్రపంచ ఆత్మహత్య నివారణోత్సవం పై అవగాహన సదస్సు





**గంభీరావుపేట. సెప్టెంబర్ 18 మన వార్త ప్రతినిధి** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన ఈరోజు ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ మరియు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్( ఐ కు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వై ఆంజనేయులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ , టి పి ఏ రాజన్న సిరిసిల్ల ప్రెసిడెంట్ సైకాలజిస్ట్ ఆధ్వర్యంలో, తెలంగాణ సైకాలజీస్ట్స్ అసోసియేషన్( డిపి ఏ మరియు"హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ టి పి ఏ. స్టేట్ వైస్ ప్రెసిడెంట్, ప్రపంచ ఆత్మహత్య నివారణోత్సవ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఉద్దేశించి సమాజంలో ఆత్మహత్య నివారణకు గల మూలాలు వాటి నిర్మూలన సాధ్యసాధ్యాలు, ఆలోచన ధోరణి, విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు బంగారు భవిష్యత్తుకు ఎలా ఉండాలి, పిల్లల్లో మార్పులు, చదువుపై ఏకాగ్రత, తల్లిదండ్రులతో, సోదరులతో, ఉపాధ్యాయులతో, ఎగ్జామ్ రిజల్ట్స్ పై అసంతృప్తి ధోరణి, తదితర, పలు రకాల ఉదాహరణలతో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మన కుటుంబంలో జరుగుతున్న మార్పులు చుట్టుప్రక్కల వ్యక్తుల ప్రవర్తన, తోటి విద్యార్థులతో ప్రవర్తించే సత్ప్రవర్తన విధానం మున్నగు వాటిపై తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.పి.ఏ ఆఫ్ రాజన్న సిరిసిల్ల వైస్ ప్రెసిడెంట్, సైకాలజిస్ట్ ఏ. ఈశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్,పి. ధర్మపురి, డాక్టర్ శ్రావణ్ కుమార్ డాక్టర్ ఆది విష్ణు, డాక్టర్ కె. వి. బిక్షమయ్య,శ్రీనివాస్ మనోహర్, సుచరణ్, కృష్ణ ప్రసాద్,మహేష్, జగన్నాథం, శైలజ, దీపికా,భార్గవి, రమ్య, రవీందర్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం ప్రజల సహకరించాలి



**రామాయంపేట విద్యుత్ ఏడి ఆదయ్య చేగుంట సెప్టెంబర్ 18 ( మన వార్తా ప్రతినిధి)** చేగుంట మండల కేంద్రంలో నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని రామాయంపేట ఏడి ఆదయ్య తెలిపారు . చేగుంట మండలం బోనాల ఫీడర్ లో 33/11 కెవి కొత్త లైన్ పనులు చేయడానికి 132/11 కెవి చేగుంట సబ్స్టేషన్లో విద్యుత్తు సరఫరా ఆపి వేయడం జరుగుతుందని . 33/11 కెవి వెల్దుర్తి, 33/11 కెవి చేగుంట,33/11 కెవి అనంతసాగర్, 33/11 కెవి చంద్రంచల్, ఆర్ ఎస్ జి, పైనియర్, డెక్కర్, చేగుంట సెక్షన్ లోని 33/11 కెవి చేగుంట అనంతసాగర్,చందాయిపేట, కసాన్ పల్లి,సబ్స్టేషన్లో అన్ని లెవెన్ కె.వి ఫీడర్ లో విద్యుత్తు సరఫరా కు అంతరాయం కలుగుతుందని. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## మచ్చ బొల్లారం హిందూ స్మశానవాటికను కాపాడుకుందాం



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, మన వార్త:అల్వాల్ సర్కిల్ 133 డివిజన్ మచ్చ బొల్లారంలోని హిందూ స్మశానవాటికను రాంకీ సంస్థ కబ్జా చేస్తోందని, బహిరంగంగా చెత్త నిల్వ కేంద్రంగా మారుస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడినుంచి తెచ్చిన చెత్తను స్మశానవాటికలో పోస్తుండటంతో అక్కడి వాతావరణం కలుషితం అవుతోంది. చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు చెత్త వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ గ్రహీత నర్ల సురేష్ మాట్లాడుతూ. అంతక్రియలు జరపడానికి వచ్చే ప్రజలు చెత్త దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిందువుల నమ్మకం ప్రకారం స్మశానవాటికలో శివుడు వాసం ఉంటాడని విశ్వసిస్తారు. అలాంటి పవిత్ర స్థలాన్ని చెత్తతో కలుషితం చేయడం దారుణం. సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని రాంకీ నుండి స్మశానవాటికను విముక్తి కలిగించాలి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని, ప్రజల అభిప్రాయాలు, సంతకాలు సేకరించాం. మనమందరం ఐక్యంగా ఈ సామాజిక ఉద్యమంలో పాల్గొని స్మశానవాటికను కాపాడుకుందాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మధుసూదన్ రెడ్డి, డప్పు రాజు, విజయ్, అంజి రెడ్డి, ధనరాజ్, కవిత, నీరజ తదితర స్థానికులు, అలాగే బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజల ఐక్యతతో ఈ ఉద్యమం మరింత బలపడుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్వర్ణగిరి వెంకన్నకు తిరుప్పావడ సేవ



**-అంగరంగ వైభవంగా స్వర్ణగిరీశుడి నిత్య కళ్యాణ మహోత్సవం...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 18 / మన వార్త జిల్లా ప్రతినిధి** కలియుగ ప్రత్యక్ష దైవమైన తెలంగాణ యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామి వారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ సేవ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని , లడ్డు , వడ, తదితర పిండి వంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. ఉదయం 10:30 లకు శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణ్ స్వామి దివ్యకరములచే అంగరంగ వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం మాడవీధులలో స్వామి వారిని ఊరేగిస్తూ తిరివీధి ఉత్సవ సేవను నిర్వహించారు. అనంతరం దీప కాంతుల నడుమ ఉయ్యాలపై భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీనివాసుడు. చూసి తరించిన భక్తజనం. ఈరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలియజేశారు.

# సాయుధ పోరాట అమరుల త్యాగాలు వృధా కానివ్వం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపాల్వంచ భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని పోరాటంలో అమరులైన వారి త్యాగాలను వృధాకానీ ఇవ్వబోమని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులుఅడుసుమిల్లి సాయిబాబా తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను పురస్కరించుకొని సిపిఐ పాల్వంచ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ వద్ద తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత అమరవీరులకు పూలమాలలతో నివాళు లర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో సాయిబాబా మాట్లాడుతూ రజాకార్ల లాఠీ దెబ్బలకు తూటాలకు బెదరకుండా నిజాం రాజు కబంధహస్తాల నుండి స్వేచ్ఛ భారతదేశంలో తెలంగాణ విలీనం అయ్యే వరకు కమ్యూనిస్టులు చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. బిజెపి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఏ సంబంధం లేకుండానే సాయుధ పోరాటంలో మా పాత్ర ఉందని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో కులం, మతం, ప్రాంతం పేరుతో రెచ్చగొట్టి దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు. సాయుధ పోరాటాన్ని కూడా హిందూ ముస్లీంల పోరాటంగా చిత్రీకరించి అమవానపరుస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అసలుసిసలైన వారసులు కమ్యూనిస్టులేని అన్నారు. బ్రిటిష్ రజాకార్ల పాలన కు మించి నేటి పాలకులు ప్రజలపై దమనకాండ కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి దొరలు రజాకార్ల మూకలను తరిమికొట్టి ఈ తెలంగాణాకు విముక్తి కలిగించిన కమ్యూనిస్టు యోధుల స్ఫూర్తితో నేటి ప్రజా, కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయవలసిన గురుతర బాధ్యత కమ్యూనిస్ట్ శ్రేణులపై ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వీ పద్మజ, వీ కొండలరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, డి చెన్నయ్య, శనగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, నరహరి నాగేశ్వరరావు, కొంగర అప్పారావు, బీవీ సత్యనారాయణ, ఇరుకు రామారావు, ఆదినారాయణ, కరీం, పత్తి వేంకటేశ్వర్లు, కోమటి శ్రీనివాసరావు, మురళి నాయక్, ఎస్.కె గౌస్, టైలర్ బాబు, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంపెల్లి కనకేష్ పటేల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతులకు భోజన వసతి కార్యక్రమం

**-పాల్వంచ రైతులకు సరిపడా యూరియా అందించండి. కాంపెల్లి కనకేష్ పటేల్...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 18 మన వార్త ప్రతినిధి** యూరియా బస్తాల కోసం పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ



కార్యాలయం వద్ద ఉదయం నుండి వేచి ఉంటున్న రైతు సోదర, సోదరీమణులకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ నాలుగవ రోజు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా లక్ష్మీదేవిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, మరియు బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు సంకుబాపన అనుదీప్, జిల్లా నాయకులు భూక్య చందు నాయక్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంపెల్లి కనకేష్ పటేల్ మాట్లాడుతూ పాల్వంచ మండలంలోని దూర ప్రాంతాల రైతులు యూరియా కోసం ఉదయాన్నే వచ్చి క్యూ లైన్ లో సాయంత్రం వరకు వేచి ఉంటున్నారని అందుకే వారికి గత నాలుగు రోజుల నుండి మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నానని, మనకి అన్నం పెట్టే రైతుల కడుపు నింపడం చాలా సంతృప్తిగా ఉన్నదని, రైతులు కష్టపడి పంటలు పండిస్తేనే సమాజం లోని ప్రతి ఒక్కరికి అన్నం దొరుకుతుందని, అలాంటి రైతులే పస్తులు ఉండాల్సి వస్తే కళ్ళ ముందు చూస్తూ ఎలా వారికి సహాయం చేయకుండా ఉంటామని, రాబోయే రోజులలో పాల్వంచ సొసైటీ ఆఫీస్ వద్ద రైతులు భోజనాల కోసం ఇబ్బంది పడితే ఇలాగే భోజన సదుపాయం ఏర్పాటు చేస్తానని ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. సమాజంలోని సహృదయం గల దాతలు రైతులకు ఏదో ఒక విధంగా సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. పాల్వంచ పట్టణ, మండలంలోని రైతులకు సరిపడా యూరియాని తక్షణమే అందించాలని యూరియా అందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులకు ఒక్క బస్తా యూరియా ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని రైతులకు తగినంత యూరియా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఈరోజు రైతులకు భోజనం కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినటువంటి లక్ష్మీదేవిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, మరియు బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు సంకుబాపన అనుదీప్, జిల్లా నాయకులు భూక్య చందు నాయక్ లు మాట్లాడుతూ గత 50 రోజులుగా యూరియా కోసం రైతులు సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, రైతులకు సరిపడా యూరియా అందించడం ఈ ప్రభుత్వానికి సాధ్యపడటం లేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని, రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో రైతుల పడుతున్న బాధను చూసి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో తన సొంత డబ్బులతో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిగా పాల్వంచలో రైతులకు గత నాలుగు రోజులుగా మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని, అన్నం పెట్టే అన్నదాతలకే భోజనాలు ఏర్పాటు చేస్తున్నటువంటి కాంపెల్లి కనకేష్ పటేల్ కు రైతుల తరపున, బిఆర్ఎస్ పార్టీ తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.

# మలిదశ ఉద్యమ కారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**రామాయంపేట సెప్టెంబర్ 18 ( మన వార్తా ప్రతినిధి )** మెదక్ జిల్లా రామయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన మలిదశ ఉద్యమకారుడు పోలీస్ దేవేందర్ ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు,తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు పలుమార్లు జైలుకు వెళ్లిన తాను, ఉద్యమ సమయంలో పోలీసులు తీవ్రంగా హింసించారని, ఎన్నోసార్లు రాత్రి వేళల్లో ఇంటి నుండి లాక్కెళ్లి బైండొవర్ కేసులు నమోదు చేశారని ఆయన ఆ విధంగా వ్యక్తం చేశారు , మూడు సంవత్సరాల పాటు కోర్టు చుట్టూ తిరిగి అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నానని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మలిదశ ఉద్యమంలో తనలాంటి ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందులు పడినట్లు గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యమ కారులను పట్టించుకోవడం లేదని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని దేవేందర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమ కారులను ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు సంబరాలు జరుపు కోవడం,తప్ప చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించి మలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలని దేవేందర్ డిమాండ్ చేశారు.

# ప్రతి విద్యార్థి లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి



**-హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్...**

**హనుమకొండ సెప్టెంబర్ 18(మనవార్త ప్రతినిధి):**ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదివి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా పరకాల లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల,కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాస్టల్ లో తరగతి గదులు,కిచెన్,డార్మేట్రి, పరిసరాల ను పరిశీలించారు.పలు రికార్డులను తనిఖీ చేశారు.కలెక్టర్ విద్యార్థినులను పాఠ్యాంశాలకు సంబంధించి తరగతి గదిలోని బోర్డు పై రాయించారు.విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులచేత పాఠ్యాంశాలను చదివించారు.ఆయా తరగతుల విద్యార్థినులతో మీ జీవిత లక్ష్యం ఏంటి,ఏం సాధించాలనుకుంటున్నారని అడగగా డాక్టర్,ఇంజినీర్స్ అవుతామని సమాధానమిచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎంచుకున్న లక్ష్య సాధనకు మరింత కష్టపడాలని కలెక్టర్ సూచించారు.పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తామన్నారు.విద్యార్థినుల అభ్యసన,పఠన సామర్థ్యం తక్కువగా ఉందని,అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు,ధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పరకాలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు.అక్కడ ఉన్న వసతులు,విద్యార్థుల సంఖ్య ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ,తహసీల్దార్ విజయలక్ష్మి,ఎంపీడీవో ఆంజనేయులు,ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు,తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**-భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి...**
**-జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి...**



**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 18 / మన వార్త జిల్లా ప్రతినిధి** భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు.గురువార రోజు యాదగిరిగుట్ట మండల తహశీల్దార్ కార్యాలయం ను జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. భూ భారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. 22 ఏ , రేషన్ కార్డులు , ఎలక్షన్ క్లెయిమ్స్ పరిశీలించి కార్యాలయ సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగింది. యాదగిరిగుట్ట మండల కేంద్రంలో జరుగుతున్న జిఐఎస్ మ్యాపింగ్ పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రాథమిక సహకార సంఘాలను తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి



**చిన్న శంకరంపేట సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండలం చందంపేట చిన్న శంకరంపేట ప్రాథమిక సహకార సంఘాల ను మండల వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు ఎరువులకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరి ఆధార్ కార్డు పట్టా పాస్ బుక్ తీసుకుని రావాలని, కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి బిల్లులను తప్పకుండా తీసుకోవాలని తెలిపారు, ఎరువుల దుకాణదారులు సొసైటీ నిర్వాహకులు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఆయన డీలర్లకు సూచించారు, యూరియా కోసం రైతులు ఆందోళన మరో రెండు రోజుల్లో మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలకు యూరియా రావడం జరుగుతుందని, అదేవిధంగా రైతులు తమ వరి పంట పొట్ట దశలో ఉన్నవారు సగం బస్తా పొటాషియం,సగం బస్తా యూరియా కలిపి చల్లాలని దీంతో దిగుబడి కూడా బాగుంటుందని ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచించారు.

## విలేకరులను ప్రభుత్వం ఆదుకోవాలి



**జహీరాబాద్, సెప్టెంబర్ 18 (మన వార్త):** సమాజ దిశా నిర్దేశం లో నాలుగో స్థంభంగా పేరు గాంచిన విలేకరులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వై నరోత్తం అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఉన్న ఆయన వ్యక్తిగత కార్యాలయంలో దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర మహా సభల గోడ పత్రికను నరోత్తం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమాజ అభివృద్ధికి దిక్సూచిగా సేవలందిస్తున్న విలేకరులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజకీయ నాయకుల భవిష్యత్తు ను విలేకరులే నిర్దేశిస్తారని, అలాంటి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్ జహీరాబాద్ డివిజన్ కన్వీనర్ బంటు పురుషోత్తం రావు, కో కన్వీనర్ కె నవీన్ కుమార్, కోశాధికారి టి అశోక్ కుమార్, సభ్యులు యం చందు కుమార్, యం రాజేందర్, రవికుమార్, అశోక్, మహేష్ కుమార్, యం శ్రీనివాస్, సుశీల్ తేజ్ పాల్గొన్నారు.

## పాల్వంచ మున్సిపాలిటీ అన్నీ వార్డుల్లో అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలి రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీలోని అన్నీ వార్డుల్లో అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డు గట్టాయిగూడెంలో గురువారం కొత్వాల పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న డ్రైన్ లు, రోడ్లు పారిశుధ్యంను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలైన పారిశుధ్యం, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ లు ఏర్పాటు వంటి సదుపాయాలను అధికారులు కల్పించాలన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రవి కుమార్ ను మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని.కొత్వాల అన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతి వర్ధన్, గట్టాయిగూడెం ప్రాంత వాసులు పట్టా వీర కుమార్, కంపాటి దుర్గా ప్రసాద్, రేగులగడ్డ రాము, గుర్రం వెంకటరత్నం, గడ్డం వంశీ, మేదర వేణు, గడ్డం శ్రీనివాస్, వాడపల్లి ఇసాక్, గడ్డం ముత్యం, పోతురాజు బాబూ, కొత్తపల్లి రాజారావు, పట్టా భారతి, ఎల్లంగి సీత, గడ్డం విజయ్, బండి అచ్చమ్మ, వరలక్ష్మి, గడ్డం శ్రీలత,నక్కవసంత.తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన పెంచాలి




**నిజాంపేట సెప్టెంబర్ 18 ( మన వార్తా ప్రతినిధి)** ఆధునిక పరిజ్ఞానం పెరిగిన కొలది సైబర్ నేరగాళ్ళు ప్రజలను మభ్యపెట్టి, మాయ చేసి మోసం చేస్తున్నారని సైబర్ నేరాల పై గ్రామాల్లో అవగాహన పెంచాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో గల స్థానిక పోలీస్ స్టేషన్ ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ లో రికార్డు అవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ చుట్టూ పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. కేసులలో నాణ్యమైన దర్యాప్తు జరపాలని, స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణకు పాఠశాలలు, కళాశాలలో, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 100 కాల్ కు తక్షణమే స్పందించాలనీ సూచించడం జరిగిందన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానిత వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పోలీస్ సిబ్బందికి ఏమైనా వ్యక్తిగత సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్సై రాజేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నేడు పొలంపల్లికి ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య రాక



**చేగుంట సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి )** చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కొండి లక్ష్మి మృతికి స్థానిక పంచాయతీ కార్యదర్శి కారణమని, ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండి స్వామి డిమాండ్ చేశారు, మృతి చెందిన లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు పొలంపల్లి గ్రామానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రానున్నట్లు ఆయన తెలిపారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి




**-అదనపు డిఆర్డి ఓ బొజ్జ వెంకటేశ్వర్లు...**

**హసన్ పర్తి సెప్టెంబర్ 18(మనవార్త ప్రతినిధి)**:గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశ్యంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు డిఆర్ డిఓ బొజ్జ వెంకటేశ్వర్లు అన్నారు.గురువారం హసన్ పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ నందు జిల్లాలోని గ్రామీణ మహిళలకు ఎంటర్ ప్రైసెస్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అదనపు డిఆర్డిఓ బొజ్జ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ఏఎల్ఈఏపి అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రేనియర్ అఫ్ ఇండియా.ప్రపంచ బ్యాంక్ నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్ఎంపి రైసింగ్ అండ్ యాక్సలేరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డిఆర్ డిఎ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ లతో సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు తదనంతరం పదిహేను రోజుల పరిశ్రమ నిర్వహణ,ఉత్పత్తుల మార్కెటింగ్ మెళుకువలు,నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించడం జరుగుతుంది.ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్డిఎ అడిషనల్ డిఆర్డిఓ వెంకటేశ్వర్లు,డీపీఎం రాజేంద్రప్రసాద్,ఏపీఎం ప్రభాకర్, హైదరాబాద్ అలీఫ్ సంస్థ మెంబర్ కే రమాదేవి,ప్రాజెక్ట్ ఆఫీసర్ మహమ్మద్ ఖాసిం,ర్యాంపు కో ఆర్డినేటర్ వంశీ తదితరులు పాల్గొన్నారు

## మూసీలో కొట్టుకొచ్చిన మృతదేహం...



**-మృతుడి ఎడమ భుజంపై త్రిశూలం పచ్చబొట్టు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 18 / మన వార్త జిల్లా ప్రతినిధి**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం బీమా లింగం కత్వా వద్ద మూసి ప్రవాహం ఒక్కసారిగా కల్లోలం రేపింది. ప్రవాహానికి కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మగ మనిషి మృతదేహం ఆ ప్రాంతంలో కలకలం రేపిందిస్థానికులు మృతదేహాన్ని గమనించి వెంటనే వలిగొండ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా మృతుడు వయసు సుమారు 50 నుండి 60 సంవత్సరాల మధ్యగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే మృతదేహం బాగా ఉబ్బిపోవడం తో గుర్తింపు దొరకడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. మృతుడి ఎడమ భుజంపై త్రిశూలం పచ్చ బొట్టు ఉన్నట్లు తెలిపారు. అయితే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు బయటపడేలా చుట్టుపక్కల స్టేషన్లకు సమాచారం పంపినట్లు వలిగొండ మండల ఎస్ఐ తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎస్ టి యు లక్ష్యం

**మన వార్త సెప్టెంబర్ 18(కోదాడ నియోజకవర్గ ప్రతిని)** రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఎస్ టి యు సంఘ లక్ష్యం అని ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మునగాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ..పెండింగ్ డిఏలు మరియు పిఆర్సి ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని,ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు మరియు పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి, పాఠశాల విద్యా వ్యవస్థను అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టియు మండల అధ్యక్షుడిగా సత్తూరి బిక్షం, ప్రధాన కార్యదర్శిగా గార్లపాటి సుదర్శన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఎర్ర అంజన్ రెడ్డి, జిల్లా నాయకులు కంచు గంటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులు



**నార్సింగి సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి)**
నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "స్వస్త్ నారి సషక్త్ పరివార్ అభియాన్'' కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన కంటి సమస్యల ప్రత్యేక క్యాంప్ కు అనూహ్య స్పందన లభించింది. మండల వైద్యాధికారి డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజేష్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులను ఉచితంగా పంపిణీ చేసి శస్త్ర చికిత్స అవసరమున్న వారికి పెద్ద ఆసుపత్రుల కు వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ రేఖ మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళల కోసం "స్వస్త్ నారి సషక్త్ పరివార్ అభియాన్" ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. 19 శుక్రవారం చర్మ వ్యాధి నిపుణులు, 23 శనివారం స్త్రీల సంభందిత వ్యాధుల నిపుణులు, 25 గురువారం చిన్న పిల్లల వైద్య నిపుణులు, 27 శనివారం మానసిక వైద్య నిపుణులు, 29 సోమవారం చెవి ముక్కు గొంతు (ఈ.ఎన్.టి) నిపుణులు, 1 అక్టోబర్ దంత వైద్య నిపుణుల వారిచే వైద్య శిబిరాలు నిర్వహించనున్నారని వివరించారు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డా. వీర్ కుమార్, పీ.హెచ్.సీ వైద్యులు డా. రవి కుమార్, డా:వైశాలి,డా: సాయి కిరణ్,పీ హెచ్ ఎన్ రేణుక, హెచ్.ఈ.ఓ శ్రీనివాస్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గుడి గోపురం శ్రీ బాలాంజనేయ స్వామి దేవస్థానానికి టీమ్ సాయి సహకారం



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 18 మన వార్త**: గుడి గోపురం కార్యక్రమంలో భాగంగా మాల్కాజ్గిరి ఓల్డ్ నేరేడ్మెట్‌లోని శ్రీ బాలాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి మరియు పునర్నిర్మాణం కోసం రూ. 50,001/- ను దేవాలయ కమిటీ సభ్యులకు టీమ్ సాయి ప్రతినిధులు అందజేశారు. ఈ పుణ్యకార్యంలో టీమ్ సాయి వాలంటీర్లు కూడా పాల్గొన్నారు. దేవాలయాలు సనాతన ధర్మం, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతకు ప్రతీకలుగా నిలుస్తాయని, వాటి సంరక్షణ రాబోయే తరాల కోసం అత్యంత అవసరమని నిర్వాహకులు అన్నారు. ఇప్పటి వరకు టీమ్ సాయి గుడి గోపురం కార్యక్రమం ద్వారా 36 దేవాలయాల పునరుద్ధరణకు తోడ్పాటు అందించారని, ఈ సేవా కార్యక్రమం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని తెలిపారు.

## బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సేవాపక్షం కార్యక్రమం



**-ముఖ్య అతిధిగా పాల్గొన మాజీ ఎమ్మెల్యే కే ఎన్ రత్నం...**

**మొయినాబాద్ సెప్టెంబర్ 18:మన వార్త ప్రతినిధి**
మొయినాబాద్ మండలం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభరత్ కార్యక్రమం బాకారం గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక ఉన్నత పాఠశాల లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి,జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ గౌడ్,ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్, డాక్టర్ వైభవ్ రెడ్డి, పద్మనాభం, వెంకటేష్ యాదవ్, శివ,రవీందర్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, షాబాద్ కిషన్,జగపతి యాదవ్,శ్రీనాథ్ యాదవ్, విజయ్,ప్రశాంత్ గౌడ్, అధ్యక్షులు కృష్ణ చారి మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తోడ్పాటు అందించండి




**మల్యాల, సెప్టెంబర్ 18(మన వార్త ప్రతినిధి)**
మల్యాల పట్టణ మున్నూరు కాపు కులస్తులు గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న కమ్యూనిటీ హాల్( ఫంక్షన్ హాల్) నిర్మాణానికి తమ వంతుగా రూ. 10 లక్షల తోడ్పాటును అందించవలసినదిగా వినతిలో పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు కులస్తులు తెలిపారు. వినతి సమర్పించిన వారిలో గడ్డం సజన్ కుమార్, కుందారపు శంకర్, జనగాం రాములు, జనగాం శ్రీనివాస్, ముదాం శంకర్, ముదాం రాజం, కుంట శంకర్, ఆకుల శంకర్, జనగాం శేఖర్, వంగళి శ్రీను, కిష్టయ్య, గడ్డం అఖిల్ తదితరులు ఉన్నారు.

## ఆవు కడుపు లో 90 కిలోల ప్లాస్టిక్ తొలగింపు



**మన వార్త సెప్టెంబర్ 18 (కోదాడ నియోజకవర్గ ప్రతినిధి)** కోదాడ ప్రభుత్వ పశు వైద్యశాలలో ఒక ఆవు కడుపులో నుంచి 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను డాక్టర్ పెంటయ్య విజయవంతంగా తొలగించి, ఆవు ప్రాణాలను కాపాడారు. గురువారం కోదాడ కు చెందిన ఒక రైతుకు చెందిన ఆవు కొద్ది రోజులుగా మేత మేయకుండా నీరసంగా కనిపించడంతో, రైతు దానిని కోదాడ పశు వైద్యశాలకు తీసుకువెళ్లారు. డాక్టర్ పెంటయ్య పరీక్షించి, శస్త్రచికిత్స చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఆవు సూడి ఆవు అని, కడుపులో దూడ సజీవంగా ఉందని డాక్టర్ పెంటయ్య తెలిపారు.

## స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టిన బిజెపి నాయకులు



**రామాయంపేటసెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి )** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు సేవా పక్షం సేవా పకోడా అనే కార్యక్రమంలో భాగంగా నేడు రామాయంపేట మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఓబిసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామాయంపేట బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా సేవా పక్షం సేవా పకోడా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు గాంధీ జయంతి మహాత్మా గాంధీ పుట్టిన రోజు వరకు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు, మొదటి రోజు రక్తదాన శిబిరాలు రెండవ రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని స్వచ్ఛ భారత్ లో భాగంగా రామాయంపేట మున్సిపల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు, మున్సిపల్ పట్టణంలో బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ విషయంలో పూర్తిగా కొంటుపడిపోయిందని అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండే విధంగా శానిటేషన్ పనులు చేపట్టాలని వారు అన్నారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని అనుకోకుండా మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఓబిసి పట్టణ అధ్యక్షుడు నాగరాజు బిసి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు చింతల శేఖర్ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి చిన్నమైల శ్రీనివాస్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథం, పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, జిల్లా నాయకులు శంకర్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు వెలుముల సిద్ధిరాములు తోపాటు ప్రశాంత్ గౌడ్, బాసం అనిల్, దయానంద రెడ్డి, సందీప్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ప్రముఖ సంఘ సేవకుడు చల్మెటి భాగ్యలక్ష్మి నరేందర్



**నిజాంపేట సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి)**
నిజాంపేటకు చెందిన బండారి చిన్నక్క ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు చల్మెటి నరేందర్ భాగ్యలక్ష్మి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల రూపాయల తోపాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ది రామ్ రెడ్డి, జాల పోచయ్య, గరుగుల సుధాకర్, గెరిగంటి బాబు, కొమట అమర్, కోమట స్వామి, కాలనివాసులు బండారి యాదగిరి, బండారి ఎల్ల స్వామి, బండారి యాదగిరి, బండారి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా ఫౌండేషన్ సీడ్ పంపిణీ



**మన వార్త సెప్టెంబర్ 18 (కోదాడ నియోజకవర్గ ప్రతినిధి)**
ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా గురువారం మునగాల మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో వరి కేఎన్ఎం 1638 మరియు పెసర డబ్ల్యూ జి జి 385 రకాలను మునగాల మండలంలో 33 మంది రైతులకు ఉచితంగా ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కొత్త రకాల ఎదుగుదల, పిలకశాతం,పురుగులు, తెగుళ్ళకు తట్టుకునే లక్షణాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్.రామకృష్ణ బాబు పరిశీలించి,రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రాజు,వ్యవసాయ విస్తరణ అధికారులు నాగు,భవాని, రమ్య, రైతులు పాల్గొన్నారు.

## దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



**కల్వకుర్తి. సెప్టెంబర్ 18 మనవార్త ప్రతినిధి**. కల్వకుర్తి పట్టణంలో 37 సంవత్సరాలుగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అంగరంగ వైభవోపేతంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసారి జరిగే నవరాత్రి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డికి ఆహ్వానం గురువారం అందించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆర్యవైశ్య మహాసభ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వాసవి దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసాశేఖర్,ముత్యాలు,పాపిశెట్టి శ్రీనివాస్, ప్రవీణ్, వేణు, వీరేష్, వెంకటేష్ తదితరులున్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ మృతి బాధాకరం: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**మన వార్త సెప్టెంబర్ 18 (కోదాడ నియోజకవర్గ ప్రతినిధి)**
కోదాడ పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు నారపరాజు వెంకట సత్యనారాయణ మృతదేహాన్ని గురువారం కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకట సత్యనారాయణ మృతి బాధాకరమని ఆయన అన్నారు.

## ఆల్వాల్‌లో వర్షం జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి నిదర్శనం ప్రజల వేదన!



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 18 మన వార్త:** గురువారం సాయంత్రం ఆల్వాల్ సర్కిల్ పరిధిలో కురిసిన భారీ వర్షం మళ్లీ ఒక నిజాన్ని స్పష్టంగా చూపించింది జిహెచ్ఎంసి అధికారులకు ప్రజల సమస్యలపై పట్టింపు లేనిదే!సాయి రెడ్డి కాలనీ, మచ్చ బొల్లారం, శివనగర్, ఎంజి నగర్ బస్ స్టాప్ వంటి ప్రాంతాలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. గుంతలు నీటిలో కనిపించకపోవడంతో బైక్ రైడర్లు జారి పడే పరిస్థితి, స్కూల్ పిల్లలు భయాందోళనలకు గురైన దృశ్యాలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రతి సంవత్సరం ఇదే దృశ్యం. అధికారులు వస్తారు, ఫొటోలు దిగుతారు. కానీ వర్షం పడితే రోడ్లు మళ్లీ చెరువుల్లా మారిపోతాయి. డ్రైనేజ్ పనులు మాటల్లోనే ఉంటున్నాయి" అని అన్నారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారు మేము పన్నులు కడుతున్నాం, కానీ ఫలితం ఏంటి? వర్షం పడితే ఇళ్లలోకే నీరు వస్తోంది. జిహెచ్ఎంసి వాళ్లకు కనీస శ్రద్ధ లేదేమో!" అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి నిర్లక్ష్యం స్పష్టమే ప్రతి వర్షాకాలం రాగానే సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. వర్షం ఆగిన గంటల తరబడి నీరు ఎండకపోవడం, గుంతలు పూడ్చకపోవడం, డ్రైనేజ్ సిస్టమ్‌ను బలోపేతం చేయకపోవడం "అల్ రిఫలెక్ట్ ది టోటల్ ఫెయిల్యూర్ అఫ్ జిహెచ్ఎంసి అర్బన్ ప్లానింగ్". ప్రజలు పన్నులు కడుతుంటే, మున్సిపల్ అధికారులు చూపేది మాత్రం నిర్లక్ష్యం మాత్రమే. శాశ్వత పరిష్కారానికి కదలకపోతే ఆల్వాల్ వాసుల ఆగ్రహం ఉప్పొంగడం ఖాయం.

## మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలో భీమ్ భరత్



**మొయినాబాద్ సెప్టెంబర్ 18:మన వార్త ప్రతినిధి** చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్న చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జనం కోసం జనం మెచ్చే నాయకుడు మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి అని అన్నారు. ఈ జన్మదిన వేడుకలో నియోజకవర్గ సీనియర్ నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీసీ నాయకులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం...




**– బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్...**

**దేవరకద్ర,సెప్టెంబర్18(మన వార్త ప్రతినిధి)** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంధాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు ను అనుచిత వ్యాఖ్యలతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దుర్భాషలాడటం తగదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ అన్నారు.బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ వేదిక మీద గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ ఉండటం వేదిక కింద గ్రంధాలయ చైర్మన్ గా ఉండటం తాను అవమానానికి గురయ్యానని భావించి కలెక్టర్ గారి దగ్గర శ్రీనివాసులు మాట్లాడుతుండగా పక్కనే ఉన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి జోక్యం చేసుకొని మీ నియోజకవర్గ నాయకుల పెత్తనం ఎక్కువగా ఉంది మీరు ఇలాగే ఉండాలని చూస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని భయపెట్టే విధంగా మాటలు మాట్లాడడం బట్టి చూస్తే బీసీ నాయకులను అణగదొక్కే విధంగా పక్కన కూర్చోబెట్టుకోవడానికి కూడా ఇబ్బందిగా భావిస్తున్నట్లు ఉండటం బీసీ సమాజం మొత్తం గమనిస్తుందని అన్నారు.బీసీల నియోజకవర్గమైన గద్వాలలో ఆ ఓట్లతో గెలిచిన మీరు బీసీల పట్ల అనుచిత వ్యాఖ్యలతో అహంకారంతో ముందుకు వెళ్తే బీసీలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, అన్ని పార్టీలలో ఉన్న బీసీలు ఈరోజు రాజకీయ చైతన్యంతో ముందుకు వెళ్తున్నారు కాబట్టి భవిష్యత్తులో బీసీల పట్ల మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే పరిస్థితిలో బీసీ సమాజం లేదని శ్రీనివాస్ సాగర్ అన్నారు.

## వృద్ధులకు కంటి ఆపరేషన్ ఖర్చులకు సహాయం



**వెంకటాపురం సెప్టెంబర్ 18 మనవార్త** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం గ్రామంలో అయిదు గురు వృద్ధులు గత కొంత కాలంగా కంటి చూపు మందగించిన సమస్యతో బాధపడుతున్న వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్ కు ఏళ్ళుటకు ప్రయాణ ఖర్చులకు సహాయం కావాలన్న విషయం తెలుసుకున్న గ్రామంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు, బట్ట నాగేందర్ 5 వేల రూపాయలు తమ వంతు సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు కొక్కురి రాజు,మంచర్ల నాగరాజు,బట్ట వెంకటేశ్వర్లు, సోలం సతీష్,బంద రాములు, పొనగంటి కృష్ణారావు, పొనగంటి ప్రసాద్,బట్ట మోహన్ రావు,గుండారపు కృష్ణ,దర్రాజు కృష్ణమూర్తి, బట్ట పురుషోత్తం,యూత్ సభ్యులు సోలం సుధాకర్,సోలం ఓంపతి,పోడెం సురేష్, బంద రాము,గగ్గురి రమేష్,బట్ట నారాయణ,చీడెం రుశ్వేశ్వరరావు, చీడెం పుల్లయ్య,బట్ట శేఖర్,పూణెం రాజేష్,బట్ట నాగేస్,కొక్కురి రాజు,మంచర్లనాగరాజు,బట్ట వెంకటేశ్వర్లు,సోలం సతీష్, బంద రాములు,ఎక్కిపోయిన సాయికిరణ్, దర్రాజు గురుమూర్తి, మంచెర్ల నరేష, బంద శ్రీకాంత్,కొప్పుల ప్రసాద్, మంచర్ల రమేష్,మంచర్ల జక్కులు,మాటూరి సుదర్శన్, మంచర్ల అబ్బరాజు, కుంట సందీప్, బంధ సాంబం,కుంట సంపత్,సోలం నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొని అభినందించారు.

## ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణి చేసిన పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్



**చేగుంట సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి)** చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు నాటుకునేందుకు హెూమ్ సీడ్ ప్లాంటేషన్ కొరకై గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయడం జరిగింది, ప్రభుత్వం యొక్క స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయడం జరిగింది గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు ఇట్టి మొక్కలను ప్రతి ఇంటి పేరడులో నాటుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు, ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ ఓ బి సి మండల పార్టీ అధ్యక్షుడు అన్నం ఆంజనేయులు, ఫీల్డ్.అసిస్టెంట్ వెంకటేష్ నారాయణ, వెంకటేష్, దుర్గయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## చెరువులో మునిగి పంచాయితీ కార్మికుడు మృతి



**రామాయంపేట సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో పంచాయతి కార్మికుడు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనుముల నర్సింలు (35) పంచాయతీ కార్మికుడిగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నర్సింలు తండ్రి దుర్గయ్య (38) కూడా గత ఇరువై ఏళ్లుగా గ్రామపంచాయతీ లేబర్గా పనిచేస్తున్నారు.ప్రతి రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఆరుగంటలకు నర్సింలు పంచాయతీ పనులకు వెళ్లాడు.అనంతరం ఉదయం 7.30 గంటలకు తన భార్య నవనీతకు ఫోన్ చేసి గ్రామ శివారులోని ఊరుకుంట వద్ద బోరు మోటారు నడవకపోవడంతో అది చూసేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు.ఈ క్రమంలో మోటారు పరిశీలించే ప్రయత్నంలో లోతైన నీటిలో మునిగి మృతి చెందినట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి



**– అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి...**

**హనుమకొండ సెప్టెంబర్ 18(మనవార్త ప్రతినిధి):**జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ కనీస ప్రమాణాలు పాటించాలనీ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ వెంకట రెడ్డి అన్నారు, గురువారం రోజున కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ,బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ,సమీక్షా సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షత జరిగింది,ఈ సందర్భంగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుచున్న బాల బాలికలకు వసతి,భోజనం,విద్యా,వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలని,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను డిస్ప్లేచేయాలని సూచించారు.సెప్టెంబర్ 20 నుండి 26 వరకు వరకు జిల్లాలోని ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్ తో పాటు మరో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలియచేసారు.అన్ని సంస్థలు ఒకే విధంగా హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించుటకు సులువుగా ఉండే విధంగా తగు చర్యలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సూచనలతో రూపొందించుకోవాలని అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకావాలని అన్నారు. అడిషనల్ డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు.కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి,జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్,డాక్టర్ పరికి సుధాకర్,ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక,బాల సదనం సూపరింటెండెంట్ కళ్యాణి,శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ ఏ మాధవి,జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్,సంగి చైతన్య విజయ్ కుమార్, సుజాత,బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్పి సీఈఓ ఎల్లయ్య...



**చిన్న శంకరంపేట సెప్టెంబర్ 18( మన వార్తా ప్రతినిధి)** గ్రామాల స్వచ్ఛతపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య తెలిపారు చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు పలు రికార్డులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రతి ఇంటి ముందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు గ్రామాల స్వచ్ఛత అభివృద్ధి అంశాలపై కార్యాలసిబ్బందితో ఆయన చర్చించారు, త్రాగునీరు సరఫరా పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామాలను ఎంపీడీవో దామోదర్ పర్యటించి పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిజారాణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మెరిసిన ఆశ్రమ బాలికల విద్యాలయ విద్యార్థులు



**దుమ్ముగూడెం, సెప్టెంబర్ 18, మన వార్త ప్రతినిధి: (టి ఎస్ ఎస్ సుబ్రహ్మణ్యం)** రెండు రోజులు భద్రాచలంలో నిర్వహించిన జోనల్ స్థాయి పరుగు, కబడ్డీ, షార్ట్ పుట్ క్రీడల్లో బాలికల ఆశ్రమ విద్యాలయం రేగుబల్లికి చెందిన జలకం భవానీ, జలకం పావని, జలకం అనూష ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంలో ఆశ్రమం పాఠశాల ప్రిన్సిపాల్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీమతి పాయం జానకిని ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. అదేవిధంగా భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

## పర్యావరణ పరిరక్షణలో భద్రాద్రి సేవలు ప్రశంసనీయం : భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఐ.ఏ.యస్



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 18, (టి. ఎస్. ఎస్. సుబ్రహ్మణ్యం), మన వార్త ప్రతినిధి** భద్రాచలంలోని డిగ్రీ కళాశాల సమీప కరకట్టపై ఈరోజు గ్రీన్ భద్రాద్రి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఐ.ఏ.యస్. మొక్కలు నాటిన అనంతరం ప్రసంగిస్తూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిరంతరం మొక్కలు నాటుతూ, వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా, భవిష్యత్తులో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టాలని సూచించి, ఈ దిశగా తాము ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు శ్రీమతి చిట్టె లలిత, కోఆర్డినేటర్ శ్రీ పామరాజు తిరుమలరావు, మాజీ అధ్యక్షులు శ్రీ పల్లింటి దేశప్ప, శ్రీ కామిశెట్టి కృష్ణార్జునరావు, శ్రీ గంగాధర వీరయ్య, శ్రీ బిర్రు సుధాకర్, శ్రీ రామరాజు, శ్రీమతి సుభాష్‌నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొడెంగలను పట్టుకునే పనిలో అధికారులు



**జహీరాబాద్, సెప్టెంబర్ 18 (మన వార్త):** జహీరాబాద్ అటవి శాఖ అధికారులు కొడెంగలను పట్టుకునే పనిలో పడ్డారు. గత వారం రోజుల నుండి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో కోడెంగలు ప్రజలపై దాడి చేస్తూ గాయపరుస్తున్న విషయం పాఠకులకు విదితమే. కోడెంగల బారి నుండి రక్షించాలని స్థానిక ప్రజలు, నాయకులు అటవీ శాఖ అధికారులకు విన్నవించడంతో, స్పందించిన అధికారులు కోడెంగలను పట్టుకునే పనిలో పడ్డారు. గురువారం రాంనగర్, గాంధీ నగర్ లలో గాలించి కొన్ని కోడెంగలను పట్టుకున్నారు. మిగతా కోడెంగలను కూడా పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పిస్తామని అటవి శాఖ అధికారులు ప్రజలకు భరోసా ఇచ్చారు. అటవి అధికారి కృష్ణమ్మ, కిరణ్ కుమార్, బిటి ఆఫీసర్లు భవాని, సంజీవ్ లకు, కోడెంగలను పట్టుకోవడంలో జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు పి రాములు నేత, ఇమ్రాన్, శివప్రసాద్, దశరథ్, మహమ్మద్ ఫసి, కాలనీ ప్రజలు సహకరించారు.

## విలాసాగర్ గ్రామంలో కటాన్ సెర్చ్...



**–30 ఇసుక కాంట్రాక్టర్లు సీజ్...**

**జమ్మికుంట, సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో గురువారం పోలీసులు కాటన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ రామకృష్ణ అధ్వర్యంలో ఏసిపి మాధవి సిబ్బందితో కలిసి గ్రామంలోని ఇంటింటి సోదాలు జరిపి అనుమానితులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న,పత్రాలు లేని 30 ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు.అనంతరం ఏసిపి మాధవి మాట్లాడుతూ పోలుసు సిబ్బంది, ప్రత్యేక బృందంతో విలాసాగర్ గ్రామంలో కాటన్ సెర్చ్ జరిపి పత్రాలు లేని 15 ట్రాక్టర్లను, అక్రమంగా ఇసుక తరలిస్తున్న 15 ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో పట్టణ సీఐ రామకృష్ణ,రూరల్ సిఐ లక్ష్మినారాయణ,ఎస్సైలు, పోలిస్ సిబ్బంది,ప్రత్యేక బృందం పాల్గొన్నారు.

# అంధకారంలో చెక్కపల్లి, బాలానగర్ రోడ్డు



**-పెద్దమ్మ తల్లి చౌరస్తాలో వెలుగని హైమాస్ లైట్...**

**-విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్న ప్రజలు వాహనదారులు...**

**వేములవాడ సెప్టెంబర్ 18 ( మన వార్త ప్రతినిధి)**

వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి, బాలానగర్ రోడ్డు సాయంత్రం అయితే చాలు అంధకారంగా మారి, విద్యుత్ దీపాలు, పెద్దమ్మ తల్లి చౌరస్తాలోని హైమాస్ లైట్ వెలగక, పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సూపర్వైజర్ కు సమాచారం అందించిన వీధి దీపాలు స్టాక్ లేవని, ఎప్పుడు వస్తాయో తెలియవని నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నాడని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోజు ఆ రోడ్డున వెళ్లే ప్రజలు, వాహనదారులు ప్రతిరోజూ ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ఎవరు బాధ్యులని ప్రజలు మండిపడుతున్నారు. ఇంటి పన్ను, నల్లా పన్ను ముక్కు పిండి వసూలు చేస్తారే తప్ప మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి అంధకారంగా మారిన చెక్కపల్లి, బాలానగర్ రోడ్డును విద్యుత్ కాంతులతో వెలిగే విధంగా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత...




**-పారిశుధ్య పనులలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్...**

**జమ్మికుంట, సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి):**

స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపాలిటీ లో గురువారం పారిశుధ్య పనులలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పాల్గొని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేను పరిసరాలను పరిశుభ్రం ఉంచేలా అనే దృఢ సంకల్పంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నేను స్వచ్ఛత వైపు నేను చేసే ప్రతి అడుగు.. భారతదేశాన్ని స్వచ్ఛంగా ఉండడానికి ఉపయోగపడుతానని ప్రతిజ్ఞ చేయాలన్నారు.పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చెప్పారు. మున్సిపల్ కార్యాలయం ప్రక్కన పార్కులో గడ్డి తొలగించి, శుభ్రపరచారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, సానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్ ,సదానందం , ఈ ఈ శ్రీకాంత్,టీపీఓ శ్రీధర్, టీపీబివో దీపికా, సి అ, వాణి, భాస్కర్, శ్రీనివాస్,కార్మికులు, పలువురు పాల్గొన్నారు.

# నిలోఫర్ ఆసుపత్రి లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహా...**

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 18, మనవార్త** నిలోఫర్ ఆసుపత్రి లో అన్ని విభాగాలను పటిష్ఠపర్చాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని, పీజీ విద్యార్థులకు ఆసుపత్రి లో హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశి%శీ%చారు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకులకు వసతి కల్పన పై సుదీర్ఘంగా మంత్రి చర్చ. రోగుల సహాయకులకు వసతి సౌకర్యం ఆసుపత్రిలో కల్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం. క్యాడర్ స్ట్రెంత్ కు అనుగుణంగా సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశం. ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రులలలో రెండవ అత్యధిక ఓపి, ఐపి వైద్య సేవలు అందిస్తున్న నిలోఫర్ ఆసుపత్రి బలోపేతం పై ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కార్యాలయం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి లోని భవనాల పరిస్థితి పై ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి చర్చించారు. నిలోఫర్ ఆసుపత్రి లో మౌలిక సదుపాయాల కల్పన, ఎచ్ఆర్, ఎక్విప్ మెంట్లు రిపేర్లు, ఆర్ ఓ వాటర్ ప్లాంట్, శానిటేషన్ , డ్రైనేజీ సిస్టం, ఇన్ఫ్రా, రోగులకు, వారి సహాయకులకు అవసరమైన సౌకర్యాల కల్పన కు పెద్దపీట వేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష లో హెల్త్ సెక్రటరీ డా.క్రిస్టినా, ఫణిందర్ రెడ్డి, డీఎంఈ డా.నరేంద్ర కుమార్ , అదనపు డీఎంఈ డా. వాణి, నిలోఫర్ ఆసుపత్రి సూపరి0టె0డెంట్ డా. విజయ్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# డీసీఎం వ్యాన్ ఢీకొని యువకుడు మృతి...



**జమ్మికుంట, సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి):**

డీసీఎం వ్యాన్ ఢీకొని యువకుడు మృతిచెందాడు.వీణవంక మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన కొలుగూరి నవీన్(22) అనే యువకుడు జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో తమ కుటుంబ సభ్యులు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం కు వెళ్తుండగా శాంతినగర్ సమీపంలో డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఆరు నెలలకితమే కోరపల్లి గ్రామానికి చెందిన శ్వేతతో వివాహం జరిగింది. తాపీ మేస్త్రి గా పనిచేసే తన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బాలయ్య మధునమ్మ రోదనలు అందరినీ కలిసి వేసాయి.విషయం తెలుసుకున్న జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


# నా ఆఫీస్ నా ఇష్టం మీరెవరు అంటున్న ఎమ్మార్వో...

-కంప్యూటర్ ఆపరేటర్ గా నా డ్రైవరే ఉంటాడు...

-మీరెవరు అడగడానికి అంటూ గుస్సా అవుతున్న ఎమ్మార్వో...




**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 18, మనవార్త.** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల తహశీల్దార్ ఆఫీసులో ఏ పని కావాలన్న ఎమ్మార్వో కార్ డ్రైవర్, చెప్పిందే వేదం అన్న చందంగా మారింది. ఆఫీసులో రోజు వారి పనుల కోసం వచ్చే ప్రజలను డ్రైవరే కంప్యూటర్ ఆపరేటర్ గా అవతారం ఎత్తి విచ్చల విడిగా దోచుకుంటున్నట్లు వినికిడి. ఒక డ్రైవర్ ఆఫీసు పనుల్లో జోక్యం చేసుకుని అన్ని పనులు చక్కబెట్టడం చూస్తుంటే వారిని ఎమ్మార్వో ఎలా పోషిస్తూ, కాపాడుతున్నాడో అర్థం చేసుకోవచ్చు.ఏదైనా పెద్ద ఫైలు దగ్గర నుండి సాధారణ కుల , ఆదాయ సర్టిఫికెట్ వరకు ఏ ఫైల్ కదలాలన్నా సెక్షన్ లో ఉన్న ఆఫీసర్ ల కన్నా ఎమ్మార్వో కార్ డ్రైవర్ జోక్య%శీ%తోనే త్వరగా పని అయిపోతుంది అంటే ఆశ్చర్యం కలగక మానదు.వివిధ పనుల కోసం ఆఫీసుకి వచ్చే ప్రజలను వీరు ముందే వారితో మాట్లాడి వారితో బేర సారాలు జరిపి వారి నుండి డబ్బులు రాబట్టినాకే వారి పని జరిగేటట్టు చక్రం తిప్పుతున్నారు. వారినీ కాదని వెళ్ళిన వారు రోజులు తరబడి ఆ ఆఫీస్ చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరిగిపోవాల్సిందే తప్పా పని మాత్రం కాదు అని బహిరంగంగానే కొద్ది మంది చర్చించుకుంటున్నారు అంటేనే ఆ ఆఫీసులో ఎమ్మార్వో డ్రైవర్ ఎలా రాజ్యమేలుతున్నారు అనేది స్పష్టంగా అర్థం అవుతుంది. ఆ ఆఫీసులో డ్రైవర్ చెప్పిందే వేదం, డ్రైవర్ నీ కాదని ముందుకు పోయే ధైర్యం కూడా అక్కడ ఎవరికి లేదంటే వీరి హవా ఎలా సాగుతుందో అనేది తేలుకోవచ్చు. ప్రయివేటు వ్యక్తుల ప్రమేయంతో రోజు రోజు కి అవినీతి అక్రమాలు, లంచగొండితనం, భూ రికార్డులో అవకతవకలు ఎక్కువ అవుతున్నాయని పలువురి అభిప్రాయంగా తెలుస్తుంది. రిజిస్ట్రేషన్ పత్రాలలో తప్పులు సృష్టించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెద్ద ఎత్తున గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరి ప్రవర్తన ఇలా ఉంటే సదరు ఎమ్మార్వో పరిస్థితి ఇంకో రకంగా ఉంది.ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వెళ్ళినప్పుడు వారిని ఏ మాత్రం పట్టించుకోరు అని పలువురు చర్చించుకుంటున్నారు. కేవలం దొడ్డి దారిన వచ్చే అవినీతి సొమ్ము పై ఉన్న ఆరాటం, అక్రమంగా డబ్బులు సంపాదించాలి అనే తపన తప్పా ప్రజా అవసరాలను, ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోడు అని అర్థం అవుతుంది. తన గురించి మాట్లాడే ప్రజల భూ రికార్డులను తారు మారు చేసి తప్పుల తడకలగా మారుస్తాడు అని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇలా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రెచ్చిపోతున్న ఆ తహసీల్దార్, అతనీ డ్రైవర్, లకు అడ్డు చెప్పే వాళ్ళు లేరా? ఎందుకు వీరిని వెనకేస్తున్నారు ఇంకా ఈ అవినీతిలో ఎంత మందికి భాగస్వామ్యం ఉందో తేల్చాలని సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నగర పరిధిలో మండలాల్లో అక్రమార్కులకు సదరు ఎమ్మార్వో గట్టిగానే సహకరించినట్లు సమాచారం. అంతే కాకుండా గతంలో ఈయన చేసిన తప్పులకు ఇప్పటికీ బాధితులు ఆఫీసు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారి అడ్డంగా దోచుకు తింటున్న ఈ భారీ అవినీతి తిమింగల తహసిల్దార్ పై ఏసిబి అధికారులు దృష్టి సారించాలని ప్రజలలో పెద్ద ఎత్తున డిమాండ్ లు వస్తున్నాయి.



# నాణ్యమైన భోజనంతోపాటు విద్యాబోధన అందించాలి...



**-మండల పరిషత్ అధికారి దామోదర్...**

**చిన్న శంకరంపేట , సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండలంలోని మల్లుపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి పుష్ప వేణి, ఎంపీడీవో దామోదర్ లు ఆకస్మికంగా సందర్శించారు, ఈ సందర్భంగా పాఠశాల రికార్డును పరిశీలించారు విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, మధ్యాహ్న భోజన మంటలను పరిశీలించి పాఠశాల గదులు మరుగుదొడ్లను పరిశీలించారు, మరుగుదొడ్లు అపరిశుభ్రతతో ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు, పాఠశాల పరిసరాలు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు, పాఠశాల స్థితిగతులపై ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

# అనుమానంతో పట్టుకుంటే దొంగలని తేలింది



**జహీరాబాద్, సెప్టెంబర్ 18 (మన వార్త):** పోలీసులను చూసి పారిపోతున్న వారిని పట్టుకుంటే దొంగలు అని తేలిందని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కె వినయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పట్టణ పరిధి పస్తాపూర్ కూడలి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా, వారిని అనుమానించి పట్టుకుని విచారించారు. అనుమానితులు తమ పేర్లు జమీలుద్దీన్, ఫైజుద్దీన్ తెలిపి, ఈ నెల 12 న రాత్రి ఆర్టీఓ చెక్ పోస్ట్ వద్ద ఉన్న శ్రీ భవాని వైన్స్ లో 50 వేల నగదు, 15 మద్యం బాటిళ్లు దొంగతనం చేశామని ఒప్పుకున్నట్లు ఎస్ఐ వివరించారు. నిందితుల వద్ద నుండి 6 వేల 7 వందలు రూపాయలు నగదు, ఒక మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, జ్యుడిషియల్ రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ స్పష్టం చేశారు. ఇట్టి కేసులో ఐడి పార్టీ హెడ్ కానిస్టేబుల్ నర్సింలు, కానిస్టేబుల్ అస్లాం, ఓం దేవ్, ఆనంద్, హరి నేత్ర లు పాల్గొన్నట్లు ఎస్ఐ వినయ్ కుమారు పేర్కొన్నారు.

# అటవీ తాబేలును కుక్కల నుండి రక్షించి జూపార్కుకు అప్పగింత



**హన్మకొండ, సెప్టెంబర్ 18( మన వార్త ప్రతినిధి)** మూగ అటవీ జీవులపై భూతదయ కలిగి ఉండతమంటే ఇదేమరి. నిన్న అనగా మంగళవారం ఉదయం హన్మకొండలోని సుబేదారిలో వీధికుక్కల బారినపడి కొరుకబడుతున్న ముదురు ఆకుపచ్చ తాబేలును హన్మకొండ నివాసి అయిన సిరాజ్ వాటర్ పూరిఫయర్, ప్రొప్రైటర్, ఇట్టబోయిన రాజు ఉదయపు నడకలో ఆ వైపు వెళుతుండగా చూసి కుక్కల బారినుండి నుండి ఆ టర్టల్ ను రక్షించి అటవీ జీవరసులపైన ఉన్న తమ ప్రేమను బాధ్యతను నిరూపించుకున్నారు. వెంటనే ఇట్టిసమాచారాన్ని పర్యావరవేత్త, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ జాయింట్ సెక్రటరీ పిట్టల రవిబాబు కు ఫోన్ ద్వారా తెలియచేసారు. వెంటనే స్పందించిన రవిబాబు దానిని ఒక టబ్బులో పెట్టి సగం వరకు నీటిని పోసి అందులో ఆ తాబేలును ఉంచమని, దానిని హన్మకొండ హంటర్ రోడ్డులో గల కాకతీయ జూ పార్కులో అప్పచెప్పాల్సివుంటుందని నేను వస్తున్నానని చెప్పినారు. ఆ వెంటనే రవిబాబు హన్మకొండకు వచ్చి ఆ తాబేలును పరిశీలించగా అది ఆరోగ్యంగా ఉన్న ఒక "ఇండియన్ ఫ్లాప్ శేల్ టర్టల్ (లిస్సేమిస్ పంక్టటా) గా గుర్తించారు. భారతీయ ఫ్లాప్‌షెల్ తాబేలు (లిస్సేమిస్ పంక్టటా) ని భారత వన్యప్రాణి రక్షణ చట్టం, 1972 ప్రకారం షెడ్యూల్-%×% లో ఉంచారు. దీని ద్వారా అత్యధిక రక్షణ కల్పిస్తారని, చట్టపరంగా దీనిని వేటాడటం నేరమని మరియు ఇతర కఠిన నిబంధనలు విధించారని తెలియచేసారు. భారతీయ ఫ్లాప్‌షెల్ తాబేలు (లిస్సేమిస్ పంక్టటా) దక్షిణాసియాలో కనిపించే మంచినీటి తాబేలుల జాతి. ఇది భారతదేశంలో ఎక్కువగా కనిపించే మంచినీటి తాబేల్లలో ఒకటి. చెరువులు, వాగులు, మడుగులు, సరస్సులు మరియు సాధారణ నదులను ఇది నివాసంగా ఎంచుకుంటుందని, ఇది మితమైన స్థాయిలో ఉప్పునీటినీ తట్టుకోగలదని మరియు నది ముఖతలాలలో కూడా కనిపిస్తుంది అని తెలియచేసారు. ఆ వెంటనే ఆ టర్టిల్ ను ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు ఇందారం నాగేశ్వర్ రావు కు సమాచారమిచ్చి, దానిని ఒక కార్టన్ డబ్బాలో భద్రపరచుకొని సొంతవాహనంలో హన్మకొండ హంటర్ రోడ్డులో గల కాకతీయ జూ పార్కుకు తరలించి జూపార్క్ బీట్ ఆఫిసర్ శారద గారికి విషయాన్నీ మొత్తం వివరించగ అప్పచెప్పరు. రెస్క్యూ చేసిన ఇ.రాజును, పర్యావరణవేత్త రవిబాబును అభినందించిన బీట్ ఆఫీసర్ శారద ఆ తాబేలును పరిశీలించి, ఆరోగ్యంగా ఉన్నదని గుర్తించి జూపార్కులోని మంచినీటి కొలనులో వదిలిపెట్టినారని తెలియ చేశారు.

# టన్నెల్.. సెప్టెంబర్ 19న థియేటర్లలో




తమిళంలో విజయం సాధించిన క్రైమ్-సస్పెన్స్ థ్రిల్లర్ 'టన్నెల్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అథర్వా మురళీ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 19న గ్రాండ్‌గా విడుదల కానుంది. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి కథానాయికగా, అశ్విన్ కాకుమాను విలన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. రాజు నాయక్ భవ్యంగా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తెలుగు ట్రైలర్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంది. ట్రైలర్ చూస్తేనే సినిమా ఇంటెన్స్ యాక్షన్, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, సస్పెన్స్ తో నిండి ఉన్న థ్రిల్లర్ అనే అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ సినిమాకు సెన్సార్ కార్యక్రమాలు పూర్తియ్యాయి. యూ/ఏ సర్టిఫికేట్ అందుకున్న ఈ చిత్రాన్ని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. "సినిమా ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. కేవలం థ్రిల్ మాత్రమే కాదు, ఓ మంచి మెసేజ్‌ను కూడా బలంగా ఇచ్చే ప్రయత్నం చేశారు" అని వారు వ్యాఖ్యానించారు. తమిళంలో అథర్వా-లావణ్య కాంబినేషన్ ప్రేక్షకులను ఆకట్టుకున్న తరహాలో, ఇప్పుడు అదే కాంబో తెలుగు ఆడియెన్స్‌ను కూడా అలరించనుంది. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్‌లు, టేకింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు హైలైట్‌గా నిలిచే అవకాశముంది. ఈ చిత్రానికి సంగీతం జస్టిన్ ప్రభాకరన్, సినిమాటోగ్రఫీ శక్తి శరవణన్, ఎడిటింగ్ కలైవానన్ నిర్వహించారు. సెప్టెంబర్ 19న తెలుగు ప్రేక్షకుల కోసం 'టన్నెల్' థియేటర్లలో అడుగు పెట్టనుంది.


# 'సుందరకాండ' డిజిటల్ ఎంట్రీకి తేదీ లాక్




టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటించిన "సుందరకాండ" చిత్రం ఆగష్టు 27న గ్రాండ్ గా విడుదల అయ్యింది. ఈ సినిమాకి విడుదలైన అన్ని చోట్ల మిశ్రమ సమీక్షలని అందుకుంది. ఈ చిత్రానికి వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో రోహిత్ సరసన వృతి వాఘని కథానాయికగా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్ ఆమె తల్లిగా నటించారు. ఈ సినిమా యొక్క డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ ని జియో హాట్ స్టార్ సొంతం చేసుకుంది. తాజాగా ఇప్పుడు, ఈ చిత్రం సెప్టెంబర్ 23న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడలో ప్రసారానికి అందుబాటులోకి రానున్నట్లు స్ట్రీమింగ్ ప్లాట్ఫారం ప్రాకటించింది. ఈ విషయాన్ని తెలియజేసేందుకు డిజిటల్ ప్లాట్ఫారం సోషల్ మీడియాలో స్పెషల్ పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రంలో నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, అభినవ్, సత్య, లక్ష్మి, సునైనా కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి సందీప్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత కాగా, రాజేష్ పెంటకోట ప్రొడక్షన్ డిజైనర్, రోహన్ చిల్లాలే ఎడిటర్ గా ఉన్నారు. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, ప్రదీష్ ఎమ్ వర్మ చిత్ర విజువల్స్‌ను సంగ్రహించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి మరియు రాకేష్ మహంకాళ్ళ త్రయం ఈ సినిమాని నిర్మించారు.


# దిశా పటానీ ఇంటిపై కాల్పులు..

## ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులు



బాలీవుడ్ నటి దిశా పటానీ కుటుంబం నివసిస్తున్న బరేలీ సివిల్ లైన్స్‌లోని వారి ఫ్యామిలీ ఇంటిపై కొన్ని రోజుల క్రితం కాల్పులు జరిగిన విషయం పెద్ద కలకలం రేపింది. తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్పులు జరిపారు. ఆ సమయంలో దిశా తండ్రి, మాజీ డీఎస్పీ జగదీశ్ సింగ్ పటానీ, ఆమె తల్లి, అక్క ఖుష్బూ ఇంట్లో ఉన్నారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం తప్పింది. అయితే ఈ ఘటన వెనుక గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ఉందని స్పష్టమైంది. కాల్పుల విషయాన్ని గోల్డీ బ్రార్ సోషల్ మీడియాలో స్వయంగా బయటపెట్టారు. దిశా, ఆమె అక్క కొన్ని మతపరమైన ప్రముఖులపై వ్యాఖ్యలు చేశారన్న కారణంతో ఈ దాడి చేశామని తెలిపాడు. అతని పోస్టులో స్పష్టమైన బెదిరింపులు ఉండగా, తన నెట్‌వర్క్‌కు చెందిన అనేక మందిని ట్యాగ్ చేయడం గమనార్హం. దీంతో కేసు మరింత సీరియస్ గా మారింది. ఈ నేపథ్యంలో, గాజియాబాద్‌లోని ఒక ఆపరేషన్‌లో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్, ఢిల్లీ పోలీసుల క్రైమ్ ఇంటెలిజెన్స్ యూనిట్ కలిసి జరిపిన ఆపరేషన్‌లో ఇద్దరు నిందితులు రవీంద్ర (రోహ్‌టక్), అరుగ్ (సోనిపట్)పై ముట్టడి చేశారు. వారు పోలీసులపై కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు జరిగాయి. ఈ దాడిలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించిన వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనా స్థలంలో పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. గ్లాక్ పిస్టల్, జిగానా పిస్టల్, అనేక లైవ్ కార్ట్రిడ్జ్‌లు పట్టుబడ్డాయి.

# 'భద్రాకలి' కర్ణాటక థియేటర్ రైట్స్‌ని సొంతం చేసుకున్న ప్రముఖ బ్యానర్



కోలీవుడ్ నటుడు - దర్శకుడు - మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఆంటోనీ తన రివర్టింగ్ మరియు గ్రిప్పింగ్ ఎంటర్టైనర్లకు ప్రసిద్ధి చెందారు. అతను అరుణ్ ప్రభు దర్శకత్వంలో 'షతి తిరుమగన్' అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రం విజయ్ ఆంటోనీ యొక్క 25 ఫిల్మ్. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా యొక్క ప్రమోషనల్ కంటెంట్ కి భారీ స్పందన లభిస్తుంది. తాజాగా ఇప్పుడు మూవీ మేకర్స్ ఈ సినిమా యొక్క కర్ణాటక థియేటర్ రైట్స్‌ని KRG స్టూడియోస్ బ్యానర్ సొంతం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో వాఘా చంద్రశేఖర్, సునీల్ కృపలాని, సెల్ మురుగన్, ట్రిప్టి రవీంద్ర, మరియు మాస్టర్ కేశవ్ కీలక పాత్రల్లో ఉన్నారు. సినిమాటోగ్రఫీ మరియు బిజీఎంలను వరుసగా షెల్లీ కాలిస్ట్ మరియు విజయ్ ఆంటోనీ నిర్వహిస్తున్నారు. ప్రవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ పై ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం




ఆస్ట్రేలియాతో బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళా టీమ్ 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో టీమిండియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలి వన్డేలో ఆస్ట్రేలియా విజయం సాధించిన సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ జార్జియా వొల్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరింది. మరో ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ (9) కూడా నిరాశ పరిచింది. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన ఎలిసె పెరీ కాస్త మెరుగైన బ్యాటింగ్‌తో జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించింది. జట్టును ఆదుకుంటుందని భావించిన బేథ్ మూని(18) ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయింది. పెరీ 5 ఫోర్లతో 44 పరుగులు చేసి పెవిలియన్ చేరింది. అనబెల్ సదర్లాండ్ 4 ఫోర్లతో వేగంగా 45 పరుగులు సాధించింది. గార్డ్‌నర్ (17), మెక్‌గ్రాత్ (16), బ్రౌన్ 14 (నాటౌట్) కాస్త రాణించినా ఫలితం లేకుండా పోయింది. భారత బౌలర్లలో తెలుగుతేజం క్రాంతి గౌడ్ మూడు, దీప్తి శర్మ రెండు వికెట్లను పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఓపెనర్ స్మృతి మంధాన అండగా నలిచింది. మరో ఓపెనర్ ప్రతీక రావల్‌తో కలిసి శుభారంభం అందించింది. మంధాన ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును పరిగెత్తించింది. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను ఫోర్లు, సిక్సర్లుగా మలుచుతూ ముందుకు సాగింది. ప్రతీక 4 ఫోర్లతో 25 పరుగులు చేసింది. హర్లీన్ డియోల్ (10), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (17), వికెట్ కీపర్ రిచా ఘోష్ (29), దీప్తి శర్మ (40) పరుగులు సాధించారు. ఇక కీలక ఇన్నింగ్స్ ఆడిన మంధాన 91 బంతుల్లోనే 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 117 పరుగులు సాధించింది. ఇక చివర్లో స్నేహ్ రాణా 3 ఫోర్లతో వేగంగా 24 పరుగులు చేసింది. దీంతో భారత్ స్కోరు 292 పరుగులకు చేరింది.

# ఫైనల్‌కు నీరజ్ చోప్రా

## తొలి ప్రయత్నంతోనే బెర్త్



భారత స్టార్ జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. జపాన్‌లోని టోక్యో వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ నీరజ్ చోప్రా తన తొలి ప్రయత్నంలోనే ఈ ఘనత సాధించాడు. ఫైనల్‌కు అర్హత మార్క్ 84.50 మీటర్లను దాటాడు. నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలో బల్లెం 84.85 మీటర్ల దూరం విసిరి సునాయాసంగా ఫైనల్లోకి అడుగుపెట్టారు. నీరజ్ చోప్రా తన గ్రూపులో ఉన్న ఆరుగురు అథ్లెట్లలో మొదటి రౌండ్‌లోనే నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించిన ఏకైక ఆటగాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో నీరజ్ చోప్రా ఫైనల్ పోటీ కోసం గురువారం బరిలోకి దిగనున్నాడు. నీరజ్ చోప్రాతో పాటు పాకిస్తాన్‌కు చెందిన అర్షాద్ నదీమ్ కూడా ఫైనల్లో చేరాడు. భారత్‌కు చెందిన మరో జావెలిన్ త్రోయర్ సచిన్ యాదవ్(83.67మీ.) 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. టాప్-12లో నిలిచిన త్రోయర్ల మధ్య నేడు పతక పోటీ జరగనుంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆర్షాద్ నదీమ్, నీరజ్ చోప్రా ముఖాముఖి తలపడడం ఇదే తొలిజారి. ఆ ఒలింపిక్స్‌లో అర్షాద్ నదీమ్ 92.97 మీటర్ల త్రోతో గోల్డ్ గెలుచుకోగా.. నీరజ్ చోప్రా 89.45 మీటర్ల త్రోతో రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com